
# ది ఛేజ్

జె.వి.బాబు



వంద కిలోమీటర్ల వేగంతో వెళ్తోంది కారు.

వెనుక వున్న జీప్‌లో ఏసిపి, డ్రైవర్‌తో అన్నాడు "ఇంకా వేగం పెంచు."

జీప్ డ్రైవర్ ఏసిపి శరవణన్‌కేసి అదోలా చూసాడు. 'మనది పాతకాలంనాటి డొక్కు మహేంద్ర జీప్ సార్! అది హోండాసిటీ కారు. ఈ జీప్‌తో ఆ కారుని ఛేజ్ చేయడమంటే, ముసలమ్మ పడుచుపిల్లను వెంటపడి పట్టుకోవడంలా వుంటుంది' అని అనాలనుకున్నాడు. కాని పై అధికారి కావడంతో అనలేకపోయాడు. కసిగా యాక్సిలేటర్‌ని నొక్కాడు. ఎంత నొక్కినా దాని స్పీడోమీటర్ ముల్లు అరవై, డెబ్బయ్ మధ్యనే కదలాడసాగింది.

అది గుర్తించాకే కాబోలు ఏసిపి శరవణన్ చెక్‌పోస్ట్ దగ్గరున్న పోలీసులను అలర్ట్ చేసాడు.

హోండాసిటీ కారు వారి కనుచూపును దాటింది.

ఐతే జీప్ మరికొద్ది దూరం వెళ్ళేసరికి, చెక్‌పోస్ట్ దగ్గర ఆ కారు ఆగివుండడమూ కనిపించింది.

జీప్ ఆగి ఆగకముందే శరవణన్ జీప్‌లో నుండి కిందికి దూకి, పరుగులాంటి నడకతో కారు దగ్గరగా వెళ్ళాడు. రివాల్వర్ తీసి డ్రైవింగ్ సీట్లో వ్యక్తికి గురిపెట్టి పలికాడు. "దిగు".

ఆ వ్యక్తి భయం, అయోమయం కలగలసిన చూపులతో అతడినే చూస్తూ, డోర్ తెరుచుకుని కిందికి దిగాక అడిగాడు. "ఏమయ్యింది సార్."

శరవణన్ ఆ వ్యక్తికి జవాబు చెప్పలేదు. పోలీసుకు చెప్పాడు. "కారులో వెతకండి. ...ఇందులో బ్రౌన్ షుగర్ వుండాలి."

పోలీసులు కారంతా వెతకాక చెప్పారు. "అలాంటిదేమీ లేదు సార్."

శరవణన్ షాక్ తిన్నట్టు "లేదా?!" అన్నాడు.

"లేదు సార్" పోలీసులు మరోసారి చెప్పారు.

అప్పటివరకూ అయోమయంగా అటే చూస్తున్న ఆ వ్యక్తి తేరుకుని ఎర్రబడిన ముఖంతో "ఏంటి సార్ ఇదంతా!?" ప్రశ్నించాడు.

"ఎవరో ఫోన్ ద్వారా ఇన్‌ఫర్మేషన్ ఇచ్చారు- ఈ కారులో మత్తు పదార్థాలు సప్లయ్ జరుగుతున్నాయని". అపాలజిటిక్‌గానే అన్నాడు శరవణన్.

"ఆకతాయిలెవరో ఫోన్ చేస్తే, మాలాంటివాళ్ళనలా టెన్షన్ పెట్టడం బాగాలేదు సార్".

"సారీ."

❋ ❋ ❋

"ఎస్సర్!... రియల్టర్ దామోదర్ హత్య జరిగింది. ఆ కారులోనే" సి.ఐ. ఇక్బాల్ కాన్ఫిడెంట్‌గా చెప్పాడు.

"మరొక్కసారి ఆ కారు నెంబర్ చెప్పు" ఏసిపి శరవణన్ ప్రశ్నించాడు.

సి.ఐ. చెప్పాడు.

"నో! మీరు చెప్పిన కారుని, మీరు చెప్పిన సమయానికి నేను ఛేజ్ చేసాను. ఆ సమయంలో ఆ కారు నాగపూర్ హైవేలో వెళ్తోంది."

ఇక్బాల్ కాసింత భయంగానే పలికాడు. "మీరు మరొక్కసారి గుర్తుకు తెచ్చుకోండి సార్!... మీరు ఛేజ్ చేసిన కారు నెంబర్ అది కాదేమో! ఎందుకంటే, ఆ సమయంలో కారు నెంబర్ నోట్ చేసిన ప్రత్యక్ష సాక్షులున్నారు. వాళ్ళు కన్‌ఫర్మ్‌గా కారు నెంబర్ అదే అని చెపుతున్నారు."

ఏసిపి శరవణన్ కళ్ళు మూసుకున్నాడు. 'సిటీకి ఓ మూల ఓ కారులో వెంబడించి వేటాడి, ఓ రియల్టర్‌ని హత్యచేసారు హంతకులు. సిటీకి మరోమూల అదే నెంబర్ కారును ఛేజ్‌చేసి ఏమీ దొరక్క, 'సారీ'చెప్పి పంపేసాడు తను. హత్య జరిగిన సమయం, ఛేజింగ్ జరిగిన సమయం ఒక్కటే! ఇది అసాధ్యం. ...సో! ఆ రెండు కార్లలో ఒకటి డూప్. బహుశా నెంబర్ ప్లేట్ ఛేంజ్ చేయడం జరిగి వుండొచ్చు. అంటే... ఆ కారు కలిగిన వ్యక్తిని కేసులో ఇన్‌వాల్వ్ అయ్యేలా ప్లాన్ చేయడమో లేదా అతడే ఈ మర్డర్‌కి ప్లాన్‌చేసి ఎలిబీ కోసం అలా తనే ఫోన్‌చేసి ఏసిపి ముందే వున్నట్టు ఈ రెండు కార్ల డ్రామా ఆడి వుండొచ్చు.

"సరే! ఇంతకీ ఆ కారు ఎవరిది?"

"జ్యువెల్లర్ నరేంద్రబాబుది."

❋ ❋ ❋

ఏసిపి శరవణన్‌ని చూసిన ఆమె కంగారుగా అడిగింది. "అసలేమయ్యింది సార్?"

ఆమె తన భర్తకేదైనా ఆపద కలిగిందేమోనని భయపడుతుందన్న విషయం అర్థమై "అలాంటిదేమీ లేదమ్మా! ఓ కేసు విషయంలో తనను కొన్ని ప్రశ్నలడగాలి. అంతే"అంటూ వివరణ ఇచ్చాక అడిగాడు. "నరేంద్రబాబుగారు ఎక్కడ?"

"ఆయన ఈ మధ్యాహ్నమే నాగపూర్ వెళ్ళారు సార్."

'ఛేజింగ్ తర్వాత అతడు తన టూర్ కంటిన్యూ చేసాడన్నమాట.... నరేంద్రబాబు డ్రైవ్ చేసినది ఒరిజినల్ కార్ అని తెలుస్తోంది. బట్ అది కూడా కన్‌ఫర్మ్ చేసుకోవాలి.' అందుకే అతడు వెంటనే తిరిగి రావాలి.

శరవణన్ ఆమెదగ్గర అతడి సెల్ నెంబర్ తీసుకుని డయల్ చేసాడు.

"మిస్టర్ నరేంద్రా!...ఏసిపి శరవణన్‌ని మాట్లాడుతున్నాను. మీరు వెంటనే హైదరాబాద్ తిరిగి రావాలి."

"ఎందుకు సార్?"

అతడు పరిస్థితి వివరించాడు. "...సో! మీ కారిప్పుడు హేండోవర్ చేసుకోవాలి." అవతలివైపు షాక్!

"...నేనిప్పుడే బయల్దేరుతున్నా సార్."

శరవణన్ ఇక్బాల్‌తో చెప్పాడు. "నాగ్‌పూర్ నుండి నరేంద్రబాబు వస్తున్నాడు. కారుతో సహా తనను అదుపులోకి తీసుకోండి...అరెస్ట్ కాదు."

"అలాగే సార్."

"మనమిప్పుడు రియల్టర్ దామోదర్ ఇంటికెళ్దాం." అక్కడినుండి జీప్ వేగంగా దూసుకెళ్ళింది.

❋ ❋ ❋

"నరేంద్రబాబు...ఆయనెవరు?!" దామోదర్ కొడుకు ఎదురు ప్రశ్నించడంతో కంగుతిన్నాడు ఏసిపి దామోదర్.

కాని విషయమేమీ బయటపెట్టకుండా అడిగాడు. "మీకెవరిమీదైనా అనుమానం వుందా?"

"ఇంకెవరో కాదు సార్... మాధవ్ చేయించి వుంటాడు."

"మాధవ్?!"

"మా కొత్త వెంచర్ ల్యాండ్ డీల్ చేస్తున్న వ్యక్తి. ఆ స్థలం వదిలేయమంటూ ఈమధ్య బెదిరింపులు కూడా చేసాడు."

భూతగాదాల్లో హత్యలు జరగడం మామూలే! ఇదీ అలాంటిదే అనుకొని ఆ కోణంలో దర్యాప్తు సాగించాలనుకుంటే, డూప్ కారు గొడవ కేసుని సైడ్ ట్రాక్‌లోకి లాగుతోంది. అనుమానితుడు ఒకడైతే, ఈ రెండు కార్ల గొడవ మధ్యలో నరేంద్రబాబుని ఎంటర్ చేస్తోంది.

ఏసిపి శరవణన్ అక్కడినుండి కదులుతూ పలికాడు. "మనమిప్పుడు మాధవ్‌ని కలవాలి."

"మీరు ఆఫీస్‌కెళ్ళండి సార్! నేను అతడిని తీసుకొస్తాను." చెప్పాడు ఇక్బాల్.

శరవణన్ తలాడించి ఆఫీస్ వైపు సాగాడు.

❁ ❁ ❁

"సార్! నాకూ, దామోదర్‌కి గొడవలున్నమాట వాస్తవమే. అతడిని బెదిరించానన్నదీ నిజమే. కాని...ఈ హత్యకు, నాకు ఎలాంటి సంబంధమూ లేదు."

మాధవ్ నిజం చెపుతున్నాడో, అబద్ధం చెపుతున్నాడో అర్థంకాలేదు. శరవణన్ అదోలా తలాడిస్తూ "నీ వెహికల్ ఏంటి?"

"ఇన్నోవా సార్."

"నీకు హోండాసిటీ కారుందా?!"

"లేదు."

"సరే! హంతకుడు దొరికేవరకూ నువ్వు పోలీసుల అదుపులో వుండాలి."

అతడి గొంతులో భయం "సార్?!"

శరవణన్, ఇక్బాల్‌కేసి చూసాడు. అతడిని వెంటపెట్టుకుని వెళ్ళిపోయాడు ఇక్బాల్.

❁ ❁ ❁

మరో రెండు గంటల తర్వాత ఇక్బాల్ ఫోన్ చేసాడు. "సార్! నరేంద్రబాబు నాగపూర్‌నుండి వచ్చాడు. కారు హేండోవర్ చేసుకున్నాం. అతడిని ప్రశ్నిస్తే, దామోదర్ అన్న పేరే తను వినలేదని చెపుతున్నాడు."

"అది నిజమే కావచ్చు. అతడిని అదుపులోకి తీసుకోవలసిన అవసరమేం లేదు. ..." అన్నాక, రెండు క్షణాలాగి చెప్పాడు. '... రాత్రి నుండి హత్య జరిగే ముందువరకూ దామోదర్ మొబైల్‌కి వచ్చిన ఫోన్ కాల్స్ లిస్ట్, అలాగే సిటీలో రిజిస్టర్ అయిన హోండా సిటీ కార్ల తాలూకూ ఓనర్స్ లిస్ట్, ఇంకా... ఈ ఉదయం హత్య జరిగిన రూట్‌లో ఏ ట్రాఫిక్ ఎస్సయ్యయినా హోండా సిటీ కారుకి చలానా రాయడం లాంటివి జరిగి వుంటే, ఆ లిస్ట్...ఆ ఏరియా లైన్‌క్రాసింగ్ వీడియో ఫుటేజ్ నాక్కావాలి."

"రేపుదయం లోపు అవన్నీ మీ ముందుంచుతాను సార్."

❁ ❁ ❁

లైన్ క్రాసింగ్ చేసే వెహికల్స్‌ని వీడియోలో షూట్ చేసి, ఆ వెహికల్ ఓనర్స్‌కి పోస్ట్‌ద్వారా చలానాలు పంపిస్తుంది ట్రాఫిక్ పోలీస్ డిపార్ట్‌మెంట్.

ఆ ఫుటేజ్‌ని పరిశీలిస్తున్న ఏసిపి శరవణన్ "స్టాపిట్" అరిచాడు.

వీడియోగ్రాఫర్ 'పాజ్'పెట్టి, రివైండ్ చేసాడు.

"అక్కడే...జస్ట్ ముందుకు... ఆ హోండా సిటీ కారుకి జూమ్ చేయ్... ఆ కారులో డ్రైవింగ్ సీట్లో వ్యక్తి ఫొటో నాక్కావాలి..."

శరవణన్ ముఖంలో ఏదో సాధించానన్న ఆనందం కనిపించింది. ఆ కారుకి సైడ్‌వ్యూ మాత్రమే కనిపిస్తున్నందున, నెంబర్ ప్లేట్ కనిపించడం లేదు. కాని ఆ కారులోని వ్యక్తుల కదలిక కనిపించినంతమేరా, అనుమానాస్పదంగానే వుంది.

అతడు ఇక్బాల్‌తో చెప్పాడు. "వెంటనే వెళ్ళి హతుడి కొడుకును తీసుకురా."

ఇక్బాల్ బయటకు నడిచి ఇరవై నిముషాల తర్వాత మరో వ్యక్తితో లోపలికి అడుగుపెట్టాడు.

శరవణన్ వీడియో క్లిప్పింగ్ అతడికి చూపిస్తూ పలి



**హత్యకు కారణం తెలిసింది. మరి హోండా సిటీ కారు, నరేంద్రబాబు వెహికల్ నెంబర్ వాడడానికి ప్రత్యేకమైన కారణమేమైనా వుందా?! ఏదేమైనా కారు నెంబర్ కారణంగా అతడినే అరెస్ట్‌చేయవలసిన పరిస్థితి...?! బట్... ఈ కేసులో అనుకోకుండా తనకు ఫోన్ రావడం ఛేజింగ్ ద్వారా తనే 'విట్నెస్'గా మారడంతో... ఇంకా ఆ గందరగోళం అలాగే వుంది.**

కాడు. "డ్రైవింగ్ సీట్లో వున్న ఆ వ్యక్తిని గుర్తుపట్టగలవా?!..."

ఆ వ్యక్తిని చూసిన అతడు "ఇతడు మోహన్‌రావ్! మా నాన్నకు ఫైనాన్షియర్" అరిచినట్టే అన్నాడు.

"ఇతడికి మీ నాన్నను చంపించవలసిన అవసరమే ముంటుందనుకుంటున్నారు?!"

అప్పటివరకూ అతడు మరెవరినో టార్గెట్ చేసి వున్నాడు. ఇప్పుడు మరొకరు తెరపైకి రావడంతో జీర్ణించుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు.

"సార్! ఇతడు మా నాన్న బిజినెస్‌కి ఫైనాన్స్ చేసేవాడు. ఆమధ్య రెండు మూడు కోట్లు చెల్లించలేక ఐ.పి. పిటీషన్‌కి ప్లాన్ చేస్తున్నాడు. ఒకవేళ ఆ పిటీషన్ దాఖలుచేస్తే అతడికి ఆ డబ్బు చెల్లించక్కర్లేదు. ఇప్పుడు అప్పుకోసం, జప్తు చేయించే అవకాశముంది." ఒక నిజం బయటపెట్టక తప్పని పరిస్థితి అతడిది.

హత్యకు కారణం తెలిసింది. మరి హోండా సిటీ కారు, నరేంద్రబాబు వెహికల్ నెంబర్ వాడడానికి ప్రత్యేకమైన కారణమేమైనా వుందా?! ఏదేమైనా కారు నెంబర్ కారణంగా అతడినే అరెస్ట్‌చేయవలసిన పరిస్థితి...?! బట్... ఈ కేసులో అనుకోకుండా తనకు ఫోన్ రావడం ఛేజింగ్ ద్వారా తనే 'విట్నెస్'గా మారడంతో... ఇంకా ఆ గందరగోళం అలాగే వుంది.

"సరే!... జ్యువెల్లర్ నరేంద్రబాబుకి, మోహన్‌రావ్‌కి రిలేషన్ లేదా శత్రుత్వమేమైనా వుందా?"

అతడు తల అడ్డంగా ఆడించాడు. "నాకు తెలియదు సార్."

❁ ❁ ❁

ప్లాన్డ్‌గా మోహన్‌రావ్ ఇంటి మీద దాడిచేసి హోండా సిటీ కారుతో సహా అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ హోండా సిటీ కారు నెంబర్ మరొకటి. కొన్ని ఆధారాల ఆధారంగా నరేంద్రబాబు కారు నెంబర్ తగిలించి, ఈ కారుని హత్యకు ఉపయోగించారన్నది తెలిసిపోయింది. అలా చేయడం ద్వారా దామోదర్‌ని హత్య చేయడమేకాదు, ఆ హత్యలో అనుమానితుడిగా నరేంద్రబాబుని ఇరికించడం- ఒకే దెబ్బకు రెండుపిట్టల్లా ప్లాన్ చేసారు.

వాళ్ల దురదృష్టమేమిటంటే- ఎవరో 'అజ్ఞాత స్త్రీ' తనకు 'నెగటివ్ ఇన్ఫర్మేషన్ ద్వారా నరేంద్రబాబు కారుని ఫాలో అయ్యేలా చేసింది. అతడు నిర్దోషి అన్నదానికి తననే సాక్ష్యంగా మార్చి, కేసు టేకప్ చేసేలా చేసింది.

ఇంతకీ ఆమె ఎవరన్న విషయం పక్కనపెడితే- ఆధారాలతో సహా అరెస్ట్ చేయడంతో మోహన్‌రావ్ నేరం అంగీకరించాడు. నరేంద్రబాబుని ఆ కేసులో ఎందుకు ఇరికించాలనుకున్నాడో కూడా వివరించాడు.

"...దామోదర్ ఐ.పి. పిటీషన్ పెట్టకుండా, అతడిని హత్య చేయించాలని పథకం వేసాను. అప్పుడే నాకు మరో ఆలోచన వచ్చింది... నరేంద్రబాబు ఓ ల్యాండ్ కొనడంకోసం పేపర్స్‌మీద కోటి రూపాయలు, బ్లాక్‌గా మూడు కోట్లు ఇచ్చాడు. ఇప్పుడు అతడిని ఈ కేసులో ఇరికిస్తే...బ్లాక్‌గా ఇచ్చిన మూడు కోట్లు ఇవ్వవలసిన అవసరముండదు. నాకు ఓ మూడు కోట్లు లాభం...అలా పకడ్బందీగానే ప్లాన్ చేసాను. కాని..."

తన ప్లాన్ ఎక్కడ ఫెయిలయ్యిందో అతడికి తెలియదు.

శరవణన్ మనసులోనే నవ్వుకున్నాడు. 'ఓ అజ్ఞాత స్త్రీ ఫోన్‌కాల్ వల్లనే ఈ కేసు ఇలా క్లోజ్ అయ్యిందని అతడికి చెప్పడం అనవసరం.'

'అరెస్ట్ చెయ్యండి' ఇక్బాల్‌తో చెప్పి తన జీప్ ఎక్కాడు ఏసిపి శరవణన్.

మరో అర్ధగంట తర్వాత అతడికి ఓ కాయిన్ బాక్స్ నుండి కాల్ వచ్చింది.

"థాంక్యూ సార్."

ఆ గొంతు గుర్తుపట్టాడు. 'నరేంద్రబాబు కారులో బ్రౌన్‌షుగర్ వుందంటూ తనకు రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చింది... ఆ...మె!'

అతడు నవ్వాడు. "మీరు రాంగ్ ఇన్ఫర్మేషన్ ఎందుకిచ్చారో నాకిప్పుడర్థమయ్యింది. అలాగే మీరెవరో, నరేంద్రబాబుని ఎందుకు కాపాడాలనుకున్నారో- నాకనవసరం. అసలు నేరస్థుడు దొరికాడు. అందుకు సహకరించిన మీకే నేను థాంక్స్ చెప్పాలి."

ఆమె కూడా నవ్వింది. "మీరు తెలివైనవారు. నేను మోహన్‌రావు కుటుంబ సభ్యులలో ఒకరిననీ, నాకు నరేంద్రబాబు ఏదోలా పరిచయం వుండి వుంటాననీ, ఈ హత్యకు జరిగిన ప్లాన్ తాలూకూ సంభాషణ నా చెవిన పడగానే, నేను నరేంద్రను కాపాడడంకోసమే మీకు రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చాననీ- అర్థంచేసుకునే వుంటారు... వుంటాను"

ఫోన్ కట్ అయ్యింది.

ఏసిపి శరవణన్ రిలాక్స్‌గా సీట్లో వెనక్కు వాలాడు.

★